క్లుప్తంగా

ప్రభుత్వాసుపత్రికి వితరణ

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వాసుపత్రికి హెల్పింగ్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం నీడిల్స్, మాస్కులు వితరణ చేశారు. ఆసుపత్రి ఆవరణలో వైద్య సిబ్బందికి 300 నీడిల్స్, 500 మాస్కులు అందజేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ యూత్ సభ్యులు మాట్లాడుతూ గతకొన్ని రోజులుగా కుక్కకాటు నివారణ మందు ఇచ్చేందుకు ఆసుపత్రిలో నీడిల్స్ లేవన్నారు. విషయం తెలిసి ఆసుపత్రికి నీడిల్స్, మాస్కులు అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు ఎం.రామ్‌లాల్, ఎస్కే ఆలీషా, మద్దుల స్వరూప్, గ్రంధిస్వామి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు ప్రింటర్ బహూకరణ



జగ్గంపేటలో డిగ్రీ కళాశాలకు ప్రింటర్ బహూకరిస్తున్న రామ్‌కుమార్

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు, జాతీయ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ సీహెచ్ రామ్‌కుమార్ ప్రింటర్ బహూకరించారు. ఈ మేరకు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఇ.చంద్రనాయుడుకు ప్రింటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో గత నెలలో నిర్వహించిన సైన్స్ డేకు ముఖ్య అతిథిగా వచ్చిన రామ్‌కుమార్‌ను ప్రింటర్ కావాలని కోరామన్నారు. దీనికి ఆయన స్పందించి కళాశాలకు ప్రింటర్‌ను బహూకరించడంతో కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ మట్టా మంగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు దాట్ల కృష్ణవర్మ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సీనియర్ పెన్షనర్ నాగేశ్వరరావును సత్కరిస్తున్న పెన్షనర్లు

తుని: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తుని నియోజకవర్గం పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పి.మాధవరావు కోరారు. స్థానిక కోర్టు వీధిలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో సోమవారం సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. పెన్షనర్లకు మెడికల్ రీయింబర్స్‌మెంట్, డీఆర్ పాత బకాయిల వివరాలను మాధవరావు వివరించారు. సీనియర్ పెన్షనర్ సీహెచ్ నాగేశ్వరరావు శోభకృత్ నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం పంచాంగ శ్రవణకర్త నాగేశ్వరరావును సత్కరించారు. తుని శాఖ ఉపాధ్యక్షుడు ఆంజనేయప్రసాద్, డేనియల్ జోసెఫ్, కృష్ణ, అమలరాజు, సీతారామరాజు, అప్పారావు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యార్థులకు రాగి జావ

శంఖవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం నుంచి రాగి జావను పౌష్టికాహారంగా అందించాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను ఎంఈఓ ఎస్‌వీ రమణ ఆదేశించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు రాగి జావను పౌష్టికాహారంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. స్థానిక మెయిన్ పాఠశాల్లో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.

ధారాలమ్మతల్లి ఉత్సవం



ఊరేగింపుగా కలశాలతో నదీ జలాలు తీసుకువెళుతున్న మహిళలు, భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరం శివారులో కొలువైన ధారాలమ్మతల్లి ఉత్సవం సోమవారం వైభవంగా జరిగింది. కొత్త అమవాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తుని వద్ద తాండవ నది నుంచి కలశాలతో నదీ జలాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారికి జలాభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని: స్థానిక జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై ఎస్కే అబ్దుల్ మారూఫ్ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. అనకాపల్లి జిల్లా యలమంచిలి-రేగు పాలెం మధ్యలో విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు నుంచి జారిపడి 52 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తెలుపు రంగు టీషర్ట్, ట్రాక్ ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలియలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.



లింగంపర్తిలో అరటితోటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి శ్రీవల్లి



ఏలేశ్వరంలో దుర్గమ్మగుడిపై పడిన విద్యుత్ స్తంభం



ఏలేశ్వరం చైతన్యనగరలో నేలకొరిగిన చెట్టు

గాలివాన బీభత్సం

- విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, గోడలు
- 105 ఎకరాల్లో దెబ్బతిన్న అరటితోటలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

ఏలేశ్వరం: నియోజకవర్గంలో సోమవారం గాలివాన బీభత్సం సృష్టించింది. తెలవారుజామున వీచిన ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్‌స్తంభాలు, ప్రహరీగోడలు నేలకొరిగాయి. ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. గాలివానకు చెట్లు, స్తంభాలు విరిగిపడడంతో గాఢనిద్రలో ఉన్న ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఏలేశ్వరం పట్టణంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరాఫరా నిలిచిపోయింది. పట్టణంలో విద్యుత్ సరాఫరా పునరుద్ధరణకు ట్రాన్స్‌కో అధికారులు నానాయాతనలు పడ్డారు. గత మూడురోజులుగా పడుతున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షాలతో పంటలకు సైతం నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని రమణయ్యపేటలో ఇంటిపై కొబ్బరిచెట్టు పడింది. లింగంపర్తిలో గాలులకు దెబ్బతిన్న అరటితోటలను ఉద్యానశాఖ అధికారి శ్రీవల్లి పరిశీలించారు. మండలంలో 150 హెక్టార్లలో అరటితోటలు దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

తొండంగి మండలంలో..

తొండంగి: అల్పపీడన ప్రభావంతో మండలంలో సోమవారం తెల్లవారుజామున ఈదురుగాలులతో కుండపోత వర్షం కురిసింది. వర్షానికి వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో పెద్దగా ఇబ్బంది లేనప్పటికీ సోమవారం తెల్లవారుజామున కురిసిన కుండపోత వర్షానికి పంటలకు నష్టం వాటిల్లింది. మండలంలోని మెట్ట, పల్లపు ప్రాంతాల్లో పొట్ట, కోత దశల్లో ఉన్న రబీ వరిచేలు నేలకొరిగాయి. తొండంగి, శృంగవృక్షం, గోపాలపట్నం, బెండపూడి, పి.అగ్రహారం, సీతారాంపురం, కొమ్మనాపల్లి తదితర గ్రామాల్లో అరటి తోటలు దెబ్బతిన్నాయి. మామిడితోటల్లో కాయలన్నీ నేలరాలాయి. తొండంగి ప్రధాన రహదారిలో చెట్లు, విద్యుత్‌స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో రహదారిపై రాకపోకలకు అంతరాయం కలిగింది. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విరిగిన విద్యుత్ స్తంభాలను యుద్ధప్రాతిపదికన తొలగించి నూతన స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్టు విద్యుత్‌శాఖ ఏఈ ప్రసాద్ తెలిపారు. ఈదుర గాలులు ప్రభావానికి పలు చోట్ల హోర్డింగ్‌లు, రేకు షెడ్లు నేలకొరిగాయి.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు

అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను మండల ఏఓ ఎస్.నరసింహం, ఉద్యానవనశాఖ అధికారి విజయలక్ష్మి వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి పరిశీలించారు. శృంగవృక్ష, తొండంగి, పి.అగ్రహారం, గోపాలపట్నం తదితర గ్రామాల్లో పర్యటించి పంటనష్టాన్ని అంచనా వేశారు.



శృంగవృక్షంలో నేలకొరిగిన రబీ వరి పంటను పరిశీలిస్తున్న రైతులు

ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం

శంఖవరం: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులకు ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్టు మండల హెచ్ఓ పి.అరుణ్ కుమార్, ఏఓ పి.గాంధీ తెలిపారు. మండల వ్యాప్తంగా సుమారు 95 ఎకరాల్లో అరటి పంట, 90 ఎకరాల్లో మామిడి, 50 ఎకరాల్లో జీడిమామిడి పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. సోమవారం తెల్లవారుజామున వీచిన ఈదురు గాలులకు అరటితోటలు నేలకొరిగాయి. చేతికి వచ్చిన పంట దెబ్బతినడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. కాగా వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు.



ధర్మవరంలో నేలరాలిన మామిడి పంటను ఒబ్బిడి చేస్తున్న రైతు



ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో నేలకొరిగిన అరటి పంట

మామిడి పంటకు తీవ్ర నష్టం

ప్రత్తిపాడు/ ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా సోమవారం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. మండలంలోని పెద్దిపాలెం, ఇ.గోకవరం, వేములపాలెం, కిత్తమూరిపేట, ఉత్తరకంచి, శరభవరం, ధర్మవరం, ఒమ్మంగి, పెదశంకర్లపూడి, టి.రాయవరం తదితర గ్రామాల్లో మామిడి, జీడిమామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోతకు వచ్చిన మామిడి కాయలు నేలరాలాయి. మామిడి చెట్లు సైతం విరిగిపోయాయి. ఒమ్మంగి – శరభవరం రోడ్డులో భారీ వృక్షాలు నేలకొరిగాయి. వర్షం వల్ల చేతికి అందిన మామిడి పంట నేలపాలు కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగు రోడ్లపై ప్రవహించింది.

విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం

శంఖవరం: విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా పోషణ పఖ్వాడా పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో పోషణ పఖ్వాడా కార్యక్రమాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 5కే రన్ చేపట్టి పోషణ పఖ్వాడాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం వై.సూర్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 60 మంది గైర్హాజరు

కిర్లంపూడి: మండలంలోని పరీక్ష కేంద్రాల్లో సోమవారం జరిగిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 60 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 537 విద్యార్థులకు గాను 505 మంది, జగపతినగరం ప్రగతి జూనియర్ కళాశాలలో 345 విద్యార్థులకు గాను 317 మంది పరీక్షలకు హాజరు కాగా 60 మంది గైర్హాజరైనట్టు కిర్లంపూడి జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ కల్యాణ్ కుమార్, డీఓ సుబ్రహ్మణ్యం వివరించారు.

హాస్టల్‌లో తనిఖీలు



ప్రత్తిపాడు బీసీ హాస్టల్‌లో బాలికల విద్యా ప్రమాణాలు తెలుసుకుంటున్న రమేష్

ప్రత్తిపాడు: స్థానిక ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని సోమవారం రాత్రి కాకినాడ జిల్లా బీసీ సంక్షేమాధికారి పి.రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల విద్యాప్రమాణాలను పరీక్షించారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. వసతి గృహ నిర్వాహణ, విద్యాప్రమాణాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్ సంక్షేమాధికారి ఎం. శైలజారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

ప్రత్తిపాడు: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. విజయవాడలో న్యాయవాది భగవాన్‌పై పోలీసులు అక్రమంగా కేసులు బనాయించడాన్ని ఖండిస్తూ కోర్టు వెలుపల ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ మాట్లాడుతూ సమాజంలో అన్యాయం జరిగిన వారికి న్యాయం అందించేందుకు పోరాడే న్యాయవాదులపై కేసులు బనాయించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు భగవాన్‌పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి రాజాల చిట్టిబాబు, బొంగులూరి మధుబాబు, కుక్కుటేశ్వరరావు, కొల్లా వీర్రాజు, పోతుల జోగేష్, బెహరా లక్ష్మీ ప్రసన్న, నరసింహరావు, ఆకుల హరిబాబు, అత్యుత రామారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

క్రీడలకు అధిక ప్రాధాన్యం

తుని: యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొనే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రాష్ట్ర ఆట్యా- పాట్యా అసోసియేషన్ సీఈవో ఆర్‌డీ ప్రసాద్ అన్నారు. స్థానిక బాడవతోటలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అట్యా-పాట్యా, టెన్నీస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం కేఎస్ జాబెజ్ అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర పీడీ, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.జార్జ్, సీఈవో ప్రసాద్, ఉమ్మడి జిల్లా టెన్నీస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అట్యా-పాట్యా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా జి.సత్యనారాయణ, కార్యదర్శిగా విక్టర్‌బాబు, ప్రశాంత్, ప్రవీణ్, రెడ్డి, పలువురు కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు. రాష్ట్ర స్థాయిలో అట్యా-పాట్యాను అభివృద్ధి చేయడంతో పాటు తునిలో మెగా టోర్నమెంట్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని సంఘ నూతన సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో పలువురు పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



తునిలో అట్యా-పాట్యా కార్యవర్గాన్ని సత్కరిస్తున్న సంఘ సభ్యులు

నోటి క్యాన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ

జగ్గంపేట: మద్యపానం, ధూమపానాలకు యువత దూరంగా ఉండాలని రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి, వివేకానంద విద్యాసంస్థల కరస్పాండెంట్ ఒమ్మి రఘురాం సూచించారు. జగ్గంపేటలో సోమవారం నోటి క్యాన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీ నుంచి జేవీఆర్ సెంటర్ వరకూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఒమ్మి రఘురాం మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం, గుట్కా, తంబాకు నమలడం తదితర వ్యసనాల వల్ల నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు వీటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జగ్గంపేట సీహెచ్‌సీ దంత వైద్యులు శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

మున్సిపల్ ఉద్యోగుల నిరసన

తుని: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ తునిలో మున్సిపల్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో సోమవారం నిరసన తెలిపారు. ప్రజా సంకల్పయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఉద్యోగులు, పెన్షనర్లు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలు పెంచాలని, సీపీఎస్ రద్దు చేయాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియమకాలు చేపట్టి ఆదుకోవాలన్నారు. మున్సిపల్ ఎంప్లాయీస్ సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధితోనే కుటుంబాలు బలోపేతం

జగ్గంపేట: మహిళల ఆర్థికాభివృద్ధితోనే కుటుంబాలు బలోపేతమవుతాయని రాజమహేంద్రవరం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ పద్మావతి అన్నారు. జగ్గంపేటలో గ్రామ పునర్నిర్మాణ సంస్థ (వీఆర్‌ఓ) ఆధ్వర్యంలో సోమవారం మహిళా దినోత్సవ సంబరాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళా సాధికారిత, మహిళల ఆర్థికాభివృద్ధి, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. వీఆర్‌ఓ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ వేడుకల్లో జర్మనీకి చెందిన థామస్ ట్రేక్టర్, ఫాదర్ వేళాంగిణి రాజు, ఫాదర్ ఇమ్మానియేల్ ఫైనాన్స్ మేనేజర్ బోస్కో తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తుని: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పారిశుధ్యం విభాగంలో ప్రతిభ చూపిన మహిళలు ఉమెన్ ఐకాన్స్ లీడింగ్ స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు సూచించారు. మరుగుదొడ్ల నిర్వహణ, తడి-పొడి చెత్త నుంచి సంపద తయారీ, స్వచ్ఛతపై అవగాహన, నూతన ఆవిష్కరణల విభాగంలో కృషి చేసిన మహిళలు అవార్డులకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ నెల 22 లోగా పట్టణంలోని సచివాలయాల కార్యదర్శులకు దరఖాస్తులు అందజేయాలన్నారు. విజేతలకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న అవార్డులు అందజేస్తారన్నారు.

అంగన్‌వాడీల ధర్నా

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు విజయవాడ మహాధర్నాకు వెళ్తున్న అంగన్‌వాడీ వర్కర్లను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ప్రత్తిపాడులో సోమవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, స్థానిక పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. మెయిన్‌రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. పక్క రాష్ట్రాల్లో మాదిరిగా అంగన్‌వాడీ వర్కర్ల, హెల్పర్ల వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని నినాదాలు చేశారు. సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లిలో...

గండేపల్లి: తమ సమస్యలు నెరవేర్చాలంటూ అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ సభకు వెళుతున్న అంగన్‌వాడీల వాహనాలను స్థానిక పోలీసులు అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో నిరసన తెలిపారు.

హైందవ సిద్ధాంత గొప్పతనాన్ని తెలుసుకోవాలి



తిమ్మాపురంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

కాకినాడ రూరల్: ప్రతి ఒక్కరూ పాశ్చాత్య పోకడలకు పోకుండా హైందవ సిద్ధాంత గొప్పతనాన్ని తెలుసుకోవాలని ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. హైదరాబాద్‌కు చెందిన 'శ్రీ తత్త్వమసి' విద్యా వైద్య ఆధ్యాత్మిక సేవా సంస్థకు చెందిన క్యాలెండర్ ఆవిష్కరణ సోమవారం జరిగింది. ఈదల శివశంకర్ ఆదేశాలతో సంస్థ అధ్యక్షుడు సుదర్శనం సత్యసాయి సూచనలతో తిమ్మాపురంలోని గోశాలలో సంస్థ కార్యదర్శి ప్రసాదరావు గురుస్వామి ఆధ్వర్యంలో చాగంటి కోటేశ్వరరావు చేతుల మీదుగా తెలుగు సంవత్సరాది క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు రగిలించిన స్ఫూర్తికి తామంతా చేయూతనిస్తున్నామని తెలిపారు. సేవా సంస్థ ట్రెజరర్ మల్లిఖార్జునశర్మ, జాయింట్ సెక్రటరీ రామ్మోహన్ గురుస్వామి పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ జాతర

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తి గ్రామదేవత నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరిజిల్లా దూబచర్ల వారిచే కాళీమాత నవదుర్గా శక్తివేషాలు, రాజమహేంద్రవరం వారితో అబ్రకదబ్రా మ్యాజిక్ షో, గుంటూరు వారితో హిమ దేవతా విగ్రహాలు, వేట్లపాలెం వారితో బాణసంచా కాల్పులు ఏర్పాటు చేశారు. చిన్నలు, పెద్దలు అమ్మవారి జాతరలో సందడి చేశారు. మంగళవారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.

కిర్లంపూడిలో...

కిర్లంపూడి: కొత్త అమావాస్యను పురస్కరించుకుని గ్రామంలో వేంచేసిన నూకాలమ్మతల్లి జాతర సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, పద్మవతి దంపతులు ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గరగల నృత్యాలు, విద్యుత్ దీపాలంకరణ, బాణసంచా కాల్పులు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బ్రేక్ డ్యాన్స్ మెషీన్‌లో పిల్లలు ఎక్కి కేరింతలు కొట్టారు. స్థానిక, పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించి, మొక్కులు తీర్చుకున్నారు.

తుని రూరల్: కొత్త అమావాస్యను పురస్కరించుకుని ఎస్.అన్నవరంలో నూకాలమ్మతల్లి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. సోమవారం రాత్రి తొమ్మిది గంటలనుంచి తెల్లవార్లు జాతర నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారిని వెండి నగలతో విశేషంగా అలంకరించారు. విద్యుత్ దీపాలంకరణలు, బాణసంచా కాల్పులు, వివిధ కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



లింగంపర్తిలో నూకాలమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పర్వతప్రసాద్



ఎస్.అన్నవరంలో నూకాలమ్మ జాతరలో భక్తుల సందడి

ఎమ్మెల్యే సుధాకర్‌పై దాడికి నిరసన

గోకవరం: అసెంబ్లీలో వైఎస్సార్ సీపీకి చెందిన దళిత ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై టీడీపీ ఎమ్మెల్యేలు దాడి చేయడాన్ని నిరసిస్తూ స్థానిక ఠాణాసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం ఆందోళన వ్యక్తం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గుల్లా ఏడుకొండలు తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా దళిత ఎమ్మెల్యేపై టీడీపీ ఎమ్మెల్యేలు దాడి చేయడం హేయమైన చర్యన్నారు. దళితులంటే టీడీపీ నేతలకు ఏమాత్రం గౌరవం, అభిమానం లేదనేది మరోసారి రుజువైందన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ దళిత నాయకులు బిజ్జి రాజు, మచ్చా మోహన్, మచ్చా జయలక్ష్మి, మందపాటి సతీష్, జక్కల వెంకన్న, కొండేటి పాపారావు, నేతల నీలయ్య పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల నిరసన

అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామిపై వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు దాడి చేశారని ఆరోపిస్తూ స్థానిక ఠాణాసెంటర్‌లో టీడీపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు.



గోకవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ దళిత నాయకులు

సాగుదారులుగా నమోదు చేయాలంటూ ధర్నా

ప్రత్తిపాడు: మండలంలోని పోతులూరులో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కల్పించి వారిని సాగుదారులుగా నమోదు చేయాలని కోరుతూ ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు నాయకత్వం వహించిన సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు మాట్లాడుతూ పోతులూరులో సుమారు 120 ఎకరాల భూమిని ఏళ్ల తరబడి గ్రామ పేదలు సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. అయితే సమగ్ర భూ సర్వే పేరిట సాగు దారులను తొలగించాలని ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. సమగ్ర భూ సర్వేలో పేదలను సాగుదారులుగా గుర్తించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు అందజేశారు. కార్యక్రమానికి తొలుత స్థానిక లిబరేషన్ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు, మార్కెట్ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యురాలు కాకర రత్నకుమారి, లిబరేషన్ నాయకులు చిన్నం చంటి, పల్లా సరస్వతి, మాదే వెంకయ్యమ్మ, చిన్నం సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పోతులూరు గ్రామ సాగుదారులు